# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ప్రభుత్వ సాయంతో నాణ్యమైన ఇందిరమ్మ ఇండ్లు

**ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట,నవంబరు 17 ప్రభాతవార్త :**నారాయణపేట జిల్లా నిర్మాణం పూర్తయిన ఆరు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన కలెక్టర్ గ్రామానికి మొత్తం 104 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైందని వాటిలో మిగతా 91ఇండ్ల నిర్మాణాలు రూఫ్ లెవల్ స్లాబ్ లెవల్, బేస్‌మెంట్ దశల్లో కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులు జమ అవుతున్నాయని ప్రభుత్వ సహాయంతో మంచి నాణ్యతతో ఇండ్లు నిర్మించుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. త్వరలో మరో 20 ఇండ్లు పూర్తయ్యే అవకాశం ఉందని, వాటిని లబ్ధిదారులకు త్వరగా అప్పగిస్తామని చెప్పారు. పథకం నిరంతర ప్రక్రియ కాబట్టి ప్రారంభించని ఇండ్లను అర్హు లకు మళ్లిస్తూ కేటాయించినట్లు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. 5లక్షల గృహ సహాయం దేశంలో ఎక్కడా లేనిదని దీనిని సక్రమంగా వినియోగించు కోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆర్థికఇబ్బందులు ఉన్నవారికి మహి ళాసంఘాలు శ్రీనిధి బ్యాంకుద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉన్నా ప్రభుత్వం లబ్ధిదారులకు పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

## ప్రజా సేవే మా లక్ష్యం

**ప్రజావాణిలో ప్రజలతో నేరుగా సంభాషించిన వనపర్తి ఎస్పీ**

**పోలీసుల స్పందనతో ప్రజావాణిలో సమస్యలకు పరిష్కారం**

**సోమవారం ప్రజావాణిలో 10 ఫిర్యాదుల స్వీకరణ**

**వనపర్తి,నవంబరు 17 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 10మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌కు ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 10 ఫిర్యాదుల్లో 01, భూతగాదాల ఫిర్యాదులు 06, భార్యభర్తల ఫిర్యాదులు 03, పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.

### గంగాధరిపల్లిలో కుక్కల దాడి

## 15 గొర్రె పిల్లల మృతి

**రైతులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆర్థిక సాయం**

**జడ్చర్ల, నవంబరు 17 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డ ఘటన జడ్చర్ల మండల పరిధిలోని గంగాధరిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే ఆదివారం మధ్యాహ్నం సమయంలో కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మరణించాయి. ఈ ఘటనలో రైతులు రాములు(5), చెన్నయ్య(3), నరేష్ (2), మలయ్య (2), జంగయ్య (2), నర్సి మా(1) కుటుంబాలు నష్టాన్ని ఎదుర్కొన్నాయి. ఈవిషయం తెలుసుకున్న జడ్చర్లశాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వెంటనే స్పందించి, బాధిత కుటుంబాలకు స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తక్షణ ఆర్థిక సాయంగా మొత్తం రూ.20,000 అందజేశారు. ఈ సందర్భంలో రైతులకు అందించిన సహాయం పట్ల ఎమ్మెల్యేకు తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మృత్యువాత పడ్డ గొర్రెలు

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**గద్వాల టౌన్, నవంబర్ 17, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, హౌసింగ్ పిడి శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్



మాగనూర్‌లో రైతుల ధర్నా

- పత్తి కొనుగోలుకు రైతుల స్లాట్ బుకింగ్
- సమ్మె అంటూ మిల్లులకు తాళం
- ఉమ్మడి జిల్లాలో నిలిచిన కొనుగోళ్లు
- మాగనూరు, ఊట్కూర్, గద్వాల రైతుల వద్ద ధర్నా
- ఎన్‌హెచ్ 167పై నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

# పత్తి రైతు పరేషాన్

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో పత్తి రైతులు పరేషాన్‌లో పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా మిల్లుల యజమానులు సమ్మె చేస్తున్న విషయంలో సోమవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. అయితే రైతులుకు విషయంలో తెలియకపోవడం, దానికి తోడు స్లాట్ కూడా బుక్ కావడంతో పత్తి అమ్ముకుందామని వచ్చి ఇబ్బందులు పడాల్సి వచ్చింది.**

**- మాగనూరు,ఊట్కూర్, గద్వాల, నవంబరు 17 ప్రభాతవార్త**

### మాగనూర్‌లో..

ఈనెల 17వ తారీకు సోమవారం స్లాట్ బుక్ చేసుకున్న పత్తి రైతులు ఆదివారం మధ్యాహ్నం నుండే మాగనూర్ మండల పరిధిలోని బసవేశ్వర జన్నింగ్ మిల్ దగ్గర సిసిఐ కు అమ్మేందుకు పత్తిలోడుతో ఉన్న వాహనాలను లైన్లో పెట్టుకున్నారు. మరి కొంతమంది రైతులు సోమవారం పత్తి కొనుగోలు ఉందా అనే విషయాన్ని మిల్లు యజమానిని అడిగితే తీసుకురమ్మన్నట్లు చెబుతున్నారు. సోమవారం దాదాపు 60వాహనాలు లైన్లో ఉన్నాయి. నిరవధిక సమ్మెలో భాగంగా మిల్లు మూసివేస్తున్నట్లు యజమాని చెప్పి తాళం వేసుకొని వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు ఎన్‌హెచ్ 167 అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించి దాదాపు మూడు గంటల పాటు స్లాట్ బుక్ అయిన విధంగా మిల్లుకు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న మాగనూర్ తహసిల్దార్ సురేష్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింప చేసే ప్రయత్నం చేశారు. కిరాయి వాహనాలలో పత్తిని తీసుకొచ్చామని, పత్తిని తీసుకుంటామని హామీ ఇచ్చేవరకు ధర్నాను విరమింప చేయమని రైతులు భీష్మించి కూర్చోవడంతో ఉన్నతాధికారులకు తహసిల్దార్ సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న సిసిఐ మేనేజర్ అనుప్ మిశ్రా మిల్లు దగ్గర ఉన్న పత్తిని స్లాట్ సంబంధం లేకుండా మిల్లు తెరిచిన వెంటనే తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలకు పోలీసులు లైన్ క్లియర్ చేశారు. మక్తల్ మండలంలోని లింగంపల్లి రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సిసిఐ,మిల్లు యజమానులు కలిసి రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఓ వైపు ప్రకృతి వల్ల నష్టం జరిగితే, వచ్చిన పత్తిని అమ్మడానికి రైతుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి రైతుకు న్యాయం చేయాలని, భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ డిమాండ్ చేశారు. ధర్నాలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గద్వాలలో లైన్‌లో నిలిచిన పత్తిలోడ్ వాహనాలు

### ఊట్కూర్‌లో రోడ్డుపై బైఠాయించి..

**ఊట్కూర్, నవంబరు17 ప్రభాతవార్త:** ఊట్కూర్‌లో సమీపంలోని విజయ కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్ల ఆకస్మికంగా నిలిపివేయడంతో స్థానిక పత్తి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట-మక్తల్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగడంతో కొంతసేపు రహదారి మీదుగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మక్తల్ నుండి నారాయణపేటకు వెళ్తున్న వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పత్తి అమ్మకం కోసం రైతులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని, ట్రాక్టర్లపై పత్తిని మిల్లుకు తీసుకువచ్చినా సరే, ఆకస్మికంగా కొనుగోలు నిలిపివేయడం అన్యాయని ఆరోపించారు. ట్రాక్టర్ల కిరాయి భారం, స్లాట్ బుకింగ్ కోసం వారం నుంచి పది రోజులు వరకు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థితిగతులు తెలుసుకున్న ఎస్.ఐ రమేష్, తహసీల్దార్ చింత రవి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి అధికారులు తెలుపడంతో నిరసన విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

## చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుంది

**రైతుల సంక్షేమమే ధ్యేయం**

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల టౌన్ నవంబర్ 17, ప్రభాత వార్త:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని, రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గద్వాల మండలం పరిధిలోని బస్రా చెరువు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో కరువు కాటకాలకు -మిగతా4లో..



వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## సేవ్ గచ్చుబావి

**కమిటీని అభినందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**

**గచ్చుబావి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ**

**కల్వకుర్తి, నవంబర్ 17 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని పురాతన చరిత్రాత్మక కలిగిన గచ్చు బావిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం సందర్శించి సేవ్ గచ్చుబావి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గచ్చు బావి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సేవ్ గచ్చుబావి యువత చేపట్టిన కార్యక్రమం ఎంతో అభినందనీయమని యువతను అభినందించారు. యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవ్ గచ్చుబావి యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, శివ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

**కొత్త బస్సులకు జెండా ఊపి ప్రారంభం..**

కొత్తగా 2 రూట్లలలో నూతన బస్సులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి మహబూబ్‌గర్-శ్రీశైలం, కల్వకుర్తి టూ గచ్చిబౌలికి నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త రూట్‌లలో బస్సులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వయంగా తాను నూతన బస్సును కొంత దూరం నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బస్సులు నడపాలని సూచించారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్వకుర్తి ప్రాంత ప్రజలకు శ్రీశైలం దేవస్థానానికి, సాఫ్ట్వేర్ ఉద్యోగులకు గచ్చిబౌలి వెళ్లడానికి సౌకర్యం కోసం కొత్త రూట్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సంతోష్ కుమార్, డిపో మేనేజర్ సుభాషిని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు, కార్మికులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులంటే ఇంతా అలుసా.?

**పని నెల రోజులు, జీతం మాత్రం సగం ఇదెక్కడి న్యాయం**

**భారీ కోతలు పెట్టిన జీతం డబ్బులు వెంటనే చెల్లించాలి**

**తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్**

**ఆర్ఎంఓ డా. శివప్రసాద్‌కు కార్మికుల వినతి**

**వనపర్తి, నవంబరు 17 ప్రభాతవార్త:** వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు గత నెల చెల్లించాల్సిన పెండింగ్ వేతనం కార్మికుల కష్టార్జితానికి చెల్లించిన జీతానికి పొంతనే లేదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి మండిపడ్డారు. సోమవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నేతృత్వంలో కార్మికుల డ్యూటీ అటెండెన్స్‌కు ఏజెన్సీ చెల్లించిన జీతాలకు ఏమాత్రం పొంతనలేదని కార్మికులకు సగం నెల జీతం కూడా చెల్లించలేదని తక్షణమే కట్ చేసిన కార్మికుల కష్టార్జితాని చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో డా. శివప్రసాద్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ జనరల్ ఆస్పత్రిలోని పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు గత నెల వేతనం ఏ ప్రాతిపదికన చెల్లించారో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల చెల్లించిన జీతం పారదర్శకత లేదని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కార్మికుల జీతాలను భారీ మొత్తంలో కట్ చేశారని అన్నారు. కొంతమంది కార్మికులకు జీతమే పడలేదని అన్నారు. కొంతమందికి నెలరోజుల -మిగతా4లో..

## ముగిసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు

**స్వామివారికి ఆభరణాల తొలగింపు**

**కొనసాగనున్న జాతర**

**చిన్నచింతకుంట,నవంబరు 17 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అక్టోబర్ 22న ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 7న ముగియనుండగా వ్యాపారస్తుల అభ్యర్థన మేరకు 17వరకు బ్రహ్మోత్సవాలను పొడిగించారు. ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు స్వామివారి ఆభరణాలను తొలగించడంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయని దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామివారి ప్రధానాలయంలో తహసిల్దారు ఎల్లన్న,ఆలయ ఈవో మహేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి,ఎస్సై ఓబుల్‌రెడ్డిలతో పాటు ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు సమక్షంలో స్వామివారి ఆభరణాలను ఒక్కొక్కటి గాలెక్కించి ఆభరణాల పెట్టెలో భద్రపరిచారు. స్వామి వారి ఆభరణాల పెట్టేకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రధానాలయం నుంచి దేవస్థానం చైర్మన్ స్వామి వారి ఆభరణాల పెట్టెను తలపై ఉంచుకుని గోవిందా.. గోవిందా కురుమూర్తి వాస గోవిందా అంటూ స్వామి వారి ప్రధాన మెట్ల మీదుగా మంగళ వాయిద్యాలు నడుమ కొండ దిగివకు తీసుకొచ్చారు. స్వామివారి ఆభరణాలను తాకెందుకు భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి ఆభరణాలు తరలించే ప్రత్యేక వాహనంలో ఆభరణాల పెట్టెను ఉంచి పోలీసు బందోబస్తు నడుమ వనపర్తి జిల్లా ఆత్మకూరులోని ఎస్బిఐలో ప్రత్యేక లాకర్‌లో స్వామివారి ఆభరణాలను భద్రపరిచారు. ఈసందర్భంగా ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌనిగోవర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని, ఈ బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. అమావాస్య వరకు జాతర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, భారతమ్మ, ఉంద్యాల శేఖర్, బాదంవెంకటేశ్వర్లు, నాగరాజు, గోపాల్, చక్రవర్ధన్‌రెడ్డిలతోపాటు ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్, లక్ష్మీ నరసింహ చార్యులు, వెంకటేష్‌తో పాటు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



ఆభరణాలను తీసుకొస్తున్న దేవస్థాన చైర్మన్



ఆభరణాలు లెక్కిస్తున్న దృశ్యం

## నర్వ లాస్ట్..

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వెనుకంజ**

**ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నర్వ, నవంబరు 17 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నారాయణపేట జిల్లాలోనే నర్వ మండలం వెనుకబడి చివరి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నర్వ మండలంలో పర్యటించి పలు కార్యాలయాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం నర్వ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, నర్వ యాస్పరేషన్ బ్లాక్ పై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో నర్వ మండలం జిల్లాలోని మిగతా మండలాల కంటే చివరి స్థానంలో ఉందని ఇందుకు అధికారుల నిరక్ష్యమే కారణం అని అసహనం వ్యక్తం చేశారు. మండలానికి మొత్తం 308 ఇండ్లు మంజూరు కాగా వాటిలో 170 ఇండ్ల నిర్మాణాలకు ముగ్గు వేశారని - మిగతా4లో..



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## సమస్యల పరిష్కారానికి కృషి

**- ప్రజావాణిలో 48 దరఖాస్తులు,**

**- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 17 ప్రభాతవార్త:** రాష్ట్ర, జిల్లా, స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజావాణి సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 48 అర్జీలు అందాయని జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయంతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ అధికారులందరూ తమ పరిధిలో ఇప్పటివరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.




ప్రజావాణిలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**ప్రజావాణిలో తహసిల్దార్ శ్రీనివాస్**

**నవాబుపేట, నవంబరు 17 ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, మండల అధికారులు తహసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్న అన్ని శాఖల అధికారు లు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అందుబాటులో ఉండి తక్షణ పరిష్కారం చూప బడతాయని, ప్రజలు గమనించి సోమవారం తమతమ సమస్యలతో మండల అధికారుల సమ క్షంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సత్వర పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్‌తో పాటు ఆయా శాఖల సంబంధిత అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

## పిజి కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

**ఎంవిఎస్ గవర్నమెంట్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పద్మావతి**

**మహబూబ్‌నగర్, నవంబరు 17 ప్రభాతవార్త:** టీజీ సీపీజెట్ -2025 ద్వారా పీజీ కోర్సులలో మిగిలిన ఖాళీల భర్తీ - స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎన్‌విఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమిక్ ఇయర్ 2025-26 కు సంబంధించి పీజీ కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుండి స్పాట్ అడ్మిషన్ల ద్వారా దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. మిగిలిన సీట్ల వివరాలు (ఎంఎస్సి కోర్సులు): ఎంఎస్సి బోటనీ - 13 సీట్లు, ఎంఎస్సి కెమిస్ట్రీ - 13 సీట్లు, ఎంఎస్సి కంప్యూటర్ సైన్స్ - 43 సీట్లు అర్హతలు: టిజి సిపిగెట్ 2025 క్వాలిఫై అయిన అభ్యర్థులను ర్యాంక్ ఆధారంగా పరిగణనలోకి తీసుకోబడతారు. ఇంకా సీట్లు ఖాళీగా ఉన్నప్పుడు, సంబంధిత అర్హత పరీక్షలో కనీసం 50 మార్కులు పొందిన అభ్యర్థులకు అవకాశం ఇవ్వబడుతుంది. అడ్మిషన్ సమయంలో అసలు (ఒరిజినల్) సర్టిఫికెట్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ చివరి తేదీ: ఈ నెల 18 అనీ తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా అడ్మిట్ అయిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, ఈ స్పాట్ అడ్మిషన్లు అఫిలియేటెడ్ కాలేజీలకు మాత్రమే వర్తిస్తాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు కాలేజీ పిజి అడ్మిషన్ సెల్‌ను సంప్రదించి, కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## వాహనాలు వేగ పరిమితితో నడపాలి : ఎస్ఐ

**ఉప్పునుంతల, నవంబరు 17 ప్రభాతవార్త :** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వేగపరిమితి తో ప్రయాణం కొనసాగించాలని, అతివేగం ప్రమాదకరమనీ ఎస్సై వెంకట్ రెడ్డి యువకులకు అవగాహన కల్పించారు. సోమవారం సాయంత్రం మండలంలోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలోని అయ్యవారిపల్లి స్టేజి వద్ద విలేజ్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పలు సూచనలు ,సలహాలు అందించారు. రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు గల కారణాలు, వాటి నివారణ చర్యలు, ట్రాఫిక్ రూల్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయక పోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే చేయాల్సిన పనులు, సత్వరమే పోలీసులకు సమాచారం అందించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి బయటకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా ఇంటికి వెళ్లే ప్రయత్నం చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయడం లాంటి అంశాలపై యువకులకు అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో ఎస్సై వెంకట్ రెడ్డితోపాటు పెట్రోలింగ్ సిబ్బంది, విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిలోని అయ్యావారి పల్లి స్టేజ్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్సై

## బుధవారం బిజినేపల్లిలో మహా పడిపూజ

**బిజినేపల్లి, నవంబరు 17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సిరిసంపదల భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం మద్దిమడుగు పబ్బతి శ్రీ ఆంజనేయ స్వామి మాల ధారణ స్వాములచే మహా పూజ నిర్వహించనున్నట్లు దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మద్దిమడుగు క్షేత్రం పీఠాధిపతి శ్రీ కేతావత్ జయరాం గురుస్వామి వారిచే మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వివరించారు. ఉదయం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నుండి శ్రీ సిరి సంపదల భక్త ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు ఉత్సవ విగ్రహం కలశాల ఊరేగింపు, ఆలయంలో అఖండ దీపారాధన, గణపతి పూజ, శ్రీదత్తాత్రేయ స్వామి పూజ, హనుమాన్, గాయత్రి యజ్ఞం మహోత్సవము, భక్తి కార్యక్రమాలు కన్నుల పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ఆంజనేయ స్వామి మాలదారులు, జిల్లా మాలధార స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ అజీమ్‌ను అభినందించిన మంత్రి

**మక్తల్ టౌన్, నవంబరు 17 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ మొహమ్మద్ అజీమ్‌ను తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. గచ్చిబౌలిలో జరుగుతున్న 25 వ పారా నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ లో కేరళ రాష్ట్రానికి చెందిన అజీమ్ 3 స్వర్ణ పథకాలు సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా మంత్రి వాకిటి శ్రీహరి ని కలిశారు. గోల్డ్ మెడల్స్ సాధించినందుకు అజీమ్ ను ఆప్యాయంగా హత్తుకొని మరీ అభినందించారు. పుట్టుకతోనే అంగవైకల్యంతో రెండు చేతులు లేకున్నా, ఒక కాలు చిన్నదిగా ఉన్నా కూడా స్విమ్మింగ్ లో ప్రతిభ కనబరచి మూడు గోల్డ్ మెడల్స్ సాధించడం అంత ఆషామాషీ విషయం కాదన్నారు. ఇప్పుడున్న యువతకు స్ఫూర్తిగా మొహమ్మద్ అజీమ్ నిలిచిందని మంత్రి వాకిటిశ్రీహరి అన్నారు. 2028లో జరిగే పారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించినందుకు అజీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పారా ఒలింపిక్స్‌లో కూడా మరిన్ని గోల్డ్ మెడల్స్ సాధించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పారా స్విమ్మర్ మొహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి మంత్రి సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్విమ్మర్ క్వీన్ విక్టోరియా సహకారంతో, కోచ్‌ల పర్యవేక్షణతో నేను ఈ విజయం సాధించగలిగానని అజీమ్ తెలిపారు. 50 మీటర్, 100 మీటర్ ఫ్రీ స్టైల్, 50 మీటర్, బ్యాక్ స్ట్రోక్ లో మూడు స్వర్ణాలను మొహమ్మద్ అజీమ్ సాధించాడు.




అజీమ్‌ను అభినందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## కార్తిక సోమవారానికి పోటెత్తిన భక్తులు

**వెల్దండ, నవంబర్17 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని దక్షిణకాశీగా విరజిల్లుతున్న గుండాల అంబరామలింగేశ్వర స్వామి దేవాలయానికి కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకోవడానికి విచ్చేశారు. స్వామి వారికి అభిషేకాలు వ్రతాలు, కార్తీకదీపాలు వెలిగించి తమ మొక్కలను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు శివప్రసాద్, సంతోష్ శర్మ, నరహరి శర్మ, సురేష్ శర్మ, సిబ్బంది కిషన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**నారాయణపేట, నవంబరు17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్ పై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ బి.సాయి మనోజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు తమ హక్కులు చట్టపరమైన రక్షణపై పూర్తిఅవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుటుంబంలో పెద్దలకు గౌరవం సంరక్షణ అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. వృద్ధాశ్రమాలు ప్రత్యేక వైద్య సేవలు ప్రభుత్వ ప్రయోజనాలు వంటి సదుపాయాలను తెలుసుకుని వినియోగించు కోవాలని తెలిపారు. 2007 చట్టం వృద్ధుల హక్కులను కాపాడేందుకు బలమైన రక్షణగా పనిచేస్తుం దని పేర్కొన్నారు. న్యాయ సహాయం కోసం 15100 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేస్తే పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. సురేష్, లక్ష్మిపతి గౌడ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బి.సాయి మనోజ్

# సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు

## మొక్కుబడిగా సాగిన ప్రజావాణి

**ఉప్పునుంతల, నవంబరు 17 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రభుత్వంలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి సోమవారం మండలంలోని ప్రజల సమస్యలపై తమ గోడు వినిపించుకునేందుకు వచ్చిన అధికారులు రాకపోవడంతో కార్యాలయం ప్రాంగణంలో వారి కోసం పడిగాపులు కాస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ప్రజావాణి నిర్వహించాల్సింది. కానీ అధికారులు రాకపోతే ప్రజావాణి ఏ విధంగా నడుస్తుందో తెలుస్తుంది. ప్రజావాణికి అన్ని విభాగాల అధికారులు హాజరు కాకపోవడంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణి మొక్కుబడిగా సాగింది. స్థానిక తహసిల్దార్ సిబ్బంది కార్యాలయానికి సమయానికి రాకపోవడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విఆర్వో వ్యవస్థ లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్దేశంతో గ్రామపంచాయతీ అధికారులను ప్రభుత్వం నియమించింది. జిపిఓలు సమయానికి కార్యాలయానికి రావడంతో ప్రజలకు కొంత మేలు జరుగుతుంది. రెవెన్యూ సిబ్బంది మాత్రం ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా ఉదయం 11 గంటల వరకు అధికారులు రాకపోవడం కార్యాలయానికి వచ్చిన ప్రజలు విసుగు చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పునుంతల మండలం అధికారులపై ప్రత్యేకంగా నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కార్యాలయంలో సిబ్బంది లేక వెలవెల పోతున్న ఛాంబర్లు

**తహసీల్దార్ ఛాంబర్‌లోనే ప్రజావాణి....**

ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాల్సి ఉంది. గత కొన్ని నెలల నుంచి ప్రజావాణి నిర్వహించకుండా రెవెన్యూ అధికారులు కొనసాగించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సునీత ప్రజావాణికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ ప్రజావాణికి అన్ని విభాగాల అధికారులు రాకపోవడంతో కేవలం రెండు శాఖల అధికారులు రావడంతో తహసీల్దార్ కార్యాలయం ఛాంబర్ లో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి తహసిల్దార్ సునీతతో పాటు ఐసిడిఎస్ పిరట్వాన్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ బిపాషా, ఉప్పునుంతల సెక్టర్ సూపర్వైజర్ పావని, ఎంపిడిఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ శేఖర్ లు పాల్గొన్నారు.



ప్రజలకు సేవలు అందిస్తున్న జిపిఓలు

# విత్తనోత్పత్తితో అన్నదాతలకు అధిక లాభాలు

## డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఎంవీ. నగేష్ కుమార్

**బిజినేపల్లి, నవంబరు 17 ప్రభాతవార్త :** రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లోనే నాణ్యమైన విత్తనోత్పత్తి చేపడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఎంవీ. నగేష్ కుమార్ అన్నారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మహదేవునిపేట గ్రామానికి చెందిన మహిళా రైతు విజయ పోలంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం సరఫరా చేసిన కేఎన్ఎం1638 అనే వరి రకం పంటను పరిశీలించి ,రైతులకు విత్తనోత్పత్తి ద్వారా కలిగే లాభాలను వివరించారు. జిల్లావ్యాప్తంగా 1044 మంది ఉత్తమ రైతులను గుర్తించి వారందరికీ ఉచితంగా కేఎన్ఎం1638 వరి విత్తనం అందజేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించినట్లు వివరించారు. విత్తనోత్పత్తి చేపట్టే విత్తన రకం, పంట కాలం, నీటి వినియోగం, తెగుళ్ళను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకొని రైతన్న విత్తుకోవాలని సూచించారు. విత్తనోత్పత్తి సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను,యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి ప్రోత్సహించారు. విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా రైతులకు విత్తన ఖర్చులు తగ్గడంతో పాటు కల్తీ లేని నాణ్యమైన విత్తనం సాగు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొంది రైతులు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పాలెంలోని పరిశోధన కేంద్రం ఏడీఆర్ డా. ఎల్. కృష్ణ మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసే వివిధ పంటల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణకు చేపటాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అలాగే రైతులకు వివిధ పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాస్త్రవేత్తలను కలిసి నివృత్తి చేసుకొని లాభదాయకమైన సాగు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డా. శ్రీదేవి, కేవీకే శాస్త్రవేత్తలు డా. బి.రాజశేఖర్, డా. ఒంగోలు శైల తదితరులు ఉన్నారు.




రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.ఎంవీ.నగేష్ కుమార్

# బిపిఎంపై విచారణ జరిపిన ఎంపిడిఓ వరుణ్ తేజ

**ఉప్పునుంతల, నవంబరు 17 ప్రభాతవార్త :** మండలంలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన వారికి బిపిఎం సక్రమంగా పెన్షన్లు పంపిణీ చేయడం లేదని ఫిర్యాదు మేరకు సోమవారం ఎంపిడిఓ వరుణ్ తేజ విచారణ నిర్వహించారు. దాసర్ల పల్లి గ్రామంలో బిపిఎం మురళి సరైన సమయంలో పెన్షన్లు ఇవ్వడం లేదని, సమయం అయిపోయిన తర్వాత తమ గ్రామానికి వచ్చి తీసుకొని పోవాలని ఆంక్షలు పెటుతూ పెన్షన్ దారులను ఇబ్బందులు పెడుతున్నారని గ్రామానికి చెందిన కొంతమంది అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచంద్రు, సర్పంచు ఎల్లయ్య, గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, పొనగంటి శంకరు లు ఫిర్యాదు చేయడంతో స్పందించడం ఎంపిడిఓ వరుణ్ తేజ, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. భవిష్యత్తులో తిరిగి వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లను సమయానికి ఇవ్వకుండా నిరక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. ఇకనుంచి పెన్షన్లను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బి పి యం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఇంతవరకు ఇబ్బందులు పడ్డ పెన్షన్‌దారుల వద్దకు ఇంటింటికి తిరిగి విచారణ చేపట్టారు. మరోసారి తప్పు చేయకుండా ఉంటారని విచారణలో బిపిఎం లిఖితపూర్వకంగా ఎంపిడిఓ వరుణ్ తేజకు, గ్రామస్తులకు హామీ ఇచ్చారు. విచారణ జరిపిన వారిలో ఎంపిడిఓ వరుణ్ తేజ, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు , పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, హెచ్ఆర్‌సి మొగిలి చంద్రు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దాసర్లపల్లిలో బిపిఎం పై విచారణ జరుపుతున్న ఎంపిడిఓ వరుణ్ తేజ

# భూత్పూర్ శివాలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు

**భూత్పూర్, నవంబర్ 17, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరాలయంలో కార్తీక మాస ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి మురళిధర్‌గౌడ్, భవానీగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపరమేశ్వరులకుసామూ హిక వ్రతాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉసిరిక చెట్టు వద్ద వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు టి మురళిధర్‌గౌడ్ మాట్లాడుతూ కార్తీక మాసం శైవ భక్తులకు ఎంతో పవిత్రమైందని, ముఖ్యంగా ఆఖరి సోమవారం ద్వాదశి ఉండడంతో ఈ రోజు ఎంతో విశిష్టతను సంతరించుకుందని పేర్కొన్నారు. అందుకే ప్రతీ ఏటా కార్తీక మాసంలో వనభోజ నాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, తూము శ్రీవాస్‌రెడ్డి, సత్తూర్ చంద్ర శేఖర్‌గౌడ్, మేకల సత్యనారాయణ, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్‌కుమార్, సత్తూర్ అశోక్‌గౌడ్, గొడుగు వెంకటరాజు, గడ్డం డీలర్ నర్సింహులు, పులగుర్ల మల్లేష్, సత్తూర్ సురేష్‌గౌడ్, సత్తూర్ రాకేష్‌గౌడ్‌లతో పాటు వివిధ గ్రామాలు, పట్టణానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీఎంగౌడ్ దంపతులు

# సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకోవాలి: రహమతుల్లా

**ఆత్మకూర్ నవంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేయూతను అందించే విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేసే సబ్సిడీ యంత్రాలకు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని రైతాంగం తక్షణమే దరఖాస్తులు చేసుకోవాలని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా విజ్ఞప్తి చేశారు. సోమవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025 .. 26. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వందలాది కోట్ల రూపాయలు విచ్చించి రైతులకు సబ్సిడీ యంత్రాలను అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే ఎస్సీ వర్గీయులకు 50 శాతం సబ్సిడీ చొప్పున బీసీ మరియు ఇతర వర్గాలకు 45 శాతం సభ్యులు చొప్పున సప్రియ యంత్రాలను అందించేందుకు తక్షణమే దరఖాస్తు చేసుకుని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఆత్మకూరు మార్కెట్ కార్యాలయ ఆవరణంలో కూడా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన రైతులు పండించిన ప్రతి గింజను కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని దళారులను నమ్మి రైతులు మోసపోకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రహమతుల్లా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి అరవింద్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.



కార్యాలయంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

## వరి పంట విశేషాలను రైతులు కాల్చడం చేయకూడదు

**మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్**

**ఉప్పునుంతల, నవంబరు 17 ప్రభాతవార్త :** మండలంలోని రైతులు వరి పంట విశేషాలను(వరి కొయ్యలు)రైతులు కాల్చడం చేయకూడదని మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్ పేర్కొన్నారు. విశేషాలను వరి కొయ్యలు)కాల్చడం వల్ల వాయు కాలుష్యం, సారవంతాన్ని దెబ్బ తీస్తాయని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ వివరించారు. రైతులు గమనించి (వరి కొయ్యలు)కాల్చవద్దని రైతులకు సూచించారు.

## శ్రీఊరడమ్మ దేవత ఉత్సవాలు

**అమరచింత నవంబర్ 17, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ లో వెలసిన శ్రీ శ్రీ ఊరడం మా జాతర ఉత్సవాలు ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నామని నిర్వాకులు తాటికొండ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం శ్రీ శ్రీ ఉరడమ్మ దేవతకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని శ్రీశ్రీ ఊరడమ్మ జాతర ఉత్సవాలకు పట్టణంలోని భక్తులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా మక్తల్ విద్యార్థి

**మక్తల్ టౌన్, నవంబరు 17 ప్రభాతవార్త :** వచ్చేనెల డిసెంబర్‌లో భద్రాచలంలో జరిగే అండర్ 14 ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా మక్తల్ శ్రీ గీతం పాఠశాల విద్యార్థి గౌతమ్ చంద్రను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు సన్మానం చేస్తూ వెనుక బడిన పాలమూరు జిల్లా మక్తల్ ప్రాంతం నుండి గత కొన్ని నెలలుగా క్రికెట్‌లో అద్భుతమైన ప్రతిభ కనపరుస్తున్న గౌతమ్‌ను ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా నియమించడం సంతోషకరమని భవిష్యత్ లో ఈవిద్యార్థి అనేక అంచలుగా ఎదిగి తాను చదువుతున్న పాఠశాలకు ఈ ప్రాంతంకు మరింత పేరు తీసుకురావాలని ఆశా భావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో తెరాస సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్త, డివైఎస్ఓ వెంకటేష్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటికోశాధికారి లక్ష్మినారాయణ, ప్రైవేట్ పాఠశాలల జనరల్ సెక్రటరీ అంజిరెడ్డి, ట్రస్మా సభ్యులు రమేష్ రావ్, సత్యనారా యణ గౌడ్, గీతం పాఠశాల పోషక కమిటీ అధ్యక్షులు మణికంఠ, పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 22 ఫిర్యాదులు

**నారాయణ పేట, నవంబరు 17 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో ప్రజావాణికార్యక్రమంలో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వ్యక్తిగతంగా అదనపు కలెక్టర్‌కు వివరించి అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతర పరిశీలన చేస్తూ త్వరగా పరిష్కరించాలని అధికారులు ఆదేశించబడ్డారు. ప్రజల సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రతి ఫిర్యాదుకు స్పందన ఇవ్వాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దిశా డైరీ-90 పంపిణీ

**ధన్వాడ, నవంబరు 17 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, విలువల పట్ల నిబద్ధత పెంపొందించడమే లక్ష్యంగా ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలం విద్యార్థి ప్రతి దిన కార్యాచరణ డైరీ-90ను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థి ప్రతిరోజూ చేసే పనులను విచారించుకునే అవకాశం ఈ డైరీ ఇస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కలం డైరీ రూపకర్త రవి ప్రకాష్ మే రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో ఉన్నా, పుట్టిన నేలపై ఉన్న విద్యార్థులకు ఏదో చేయాలన్న సంకల్పం ఈ డైరీ రూపంలో నెరవేరుతోంది. కెరీర్‌తో పాటు మంచి వ్యక్తిత్వం ఉంటేనే విద్యార్థి ఎదుగుతాడు. ఆ అవగాహన కలిగించడానికే ఈ డైరీ" అని తెలిపారు. సమన్వయకర్త మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే లక్ష్యం, క్రమం, మంచి అలవాట్లు అలవరచుకోవడంలో ఈ డైరీ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరవ తరగతి నుంచే రాస్తే ఐదేళ్ల తర్వాత విద్యార్థిలో కనిపించే మార్పు అమూల్యం" అన్నారు. ప్రధానోపాధ్యా యులు ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల రోజువారీ ప్రవర్తన, తప్పులు, మెరుగులు పరిశీలించుకునే అవకాశం ఈ డైరీ ఇస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేష్, అశోక్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

**ఇటిక్యాల నవంబర్ 17, ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అలాగే గురుకుల పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉండే భోజనశాలలో పరిశీలించి విద్యార్థులకు వండిన భోజ్నన. కూరలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గురుకుల పాఠశాలలో చదువుకునేందుకు గ్రామీణ ప్రాంతంలో నుండి పేద విద్యార్థులు వచ్చి చదువుకుంటారని వారికి మంచి విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టాలని బియ్యాన్ని శుభ్రంగా చేసుకోవాలని. నాణ్యమైన కూరగాయలు ఆకుకూరలను కొనుగోలు చేసి పిల్లలకు వండి పెట్టాలని అలాగే ఆరోగ్య విషయాలపై శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.. కొంతమంది విద్యార్థులతో ఆయన మాట్లాడి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా పాఠశాల భోజన తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు.. అనంతరం విద్యార్థులకు భోజన వసతిని చూసేందుకు కొత్త వార్డెన్ ఏర్పాటు చేయాలని అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న ప్లే గ్రౌండ్ లో వర్షాలు వచ్చిన సమయంలో నీరు నిలిచి పోవడం వల్ల విద్యార్థుల ఆటలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాక ఉపాధ్యాయుల హాజరు. విద్యార్థుల మెనూ రిజిస్టర్ లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. మనోహర్. జిపిఓ అలీ భాష. ఇన్చార్జి ప్రిన్సిపల్ మమత. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..



వంటశాలలో భోజనాలను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి

# వడ్లు రవాణా చేసే వాహనాలకు జియో ట్యాగింగ్ చేయాలి

**● కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్‌లు తప్పనిసరిగా వాడాలి ● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, నవంబరు 17 ప్రభాతవార్త:** జిల్లాలో నిర్ధారిత వరి కొనుగోలు కేంద్రాలు అన్ని వెంటనే ప్రారంభించాలి,వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ చేయాలి, వడ్లు రవాణా చేసే అన్ని వాహనాలను జియో ట్యాగింగ్ చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్‌లు తప్పనిసరిగా వాడాలని, జిల్లాలో నిర్ధారించిన వరి కొనుగోలు కేంద్రాలను అన్నింటిని వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో వరి కొనుగోలు పై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాన్గల్ మండలంలో కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఐకెపి, సహకార సంఘం వారు సమన్వయం చేసుకొని వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో వరి కోగోలు వేగం పెంచాలని, కొనుగోలు చేసిన ధాన్యం,రైతు వివరాలను వెంటనే ఆన్లైన్‌లో డేటా ఎంట్రీచేసి రైతుకు సత్వరమే డబ్బులు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి, ఆన్లైన్ లో చేసిన డేటాఎంట్రీకి పొంతన లేదని, డేటాఎంట్రీ అంత ఆలస్యం ఎందుకు అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు నుండి వడ్లు తూకం చేసుకొని మిల్లుకు పంపిన వెంటనే రైతుకు డబ్బులు పడే విధంగా వెంట పడాలని ఇదే ప్రధాన బాధ్యత అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 291 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 13,000మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, అందులో 10,682 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించి 6000 మెట్రిక్ టన్నులకు మాత్రమే ఆన్‌లైన్ ఎంట్రీ చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 876 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు.రైతులకు డబ్బులు పడే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలోనిబంధనల ప్రకారమే కొనుగోలు చేయాలని, ప్యాడి క్లీనర్లు తప్పనిసరిగా వాడే విధంగా చూడాలన్నారు. నాణ్యమైన వడ్లు ఇస్తే మిల్లర్లు ఒక్క గ్రాముకూడా తరుగు తీయకుండా బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. వడ్లు తరలించే అన్ని వాహనాలకు జియో ట్యాగింగ్ చేయాలని, సేకరించిన వడ్లు ఉంటే కేటాయించిన మిల్లులో ఉండాలి లేదంటే గోదాములో ఉండాలి తప్ప పక్కదారి పట్టడానికి వీలు లేదన్నారు. మిల్లర్ల నుండి బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలని, బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లర్లు ప్రైవేట్ మిల్లింగ్ సైతం చేసుకోడానికి వీలు లేదన్నారు. బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లులను వెంటనే సీజ్ చేయాల్సిందిగా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు.వరి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్య నాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. జగన్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, కోఆపరేటివ్ అధికారి ఇందిరా, ట్రాన్స్పోర్ట్ అధికారి మానస, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## నారాయణపేట-మక్తల్ రహదారిపై ఉన్న గుంతలకు మరమ్మత్తులు




రోడ్డు మరమ్మతు పనులు చేపట్టిన దృశ్యం

**నారాయణపేట, నవంబరు17 ప్రభాతవార్త:** వార్త దినపత్రికలో సోమవారం ప్రచురితమైన నారాయణపేట- టమక్తల్ రహదారి దుస్థితిపై ప్రచురితమైన వార్తకు అధికారులు వెంటనే స్పందించారు. రహదారి నిర్మాణ పనులు ప్రారంభానికి ముందు తొలుత మార్గమధ్యంలో ఉన్న ప్రమాదకర గుంతలను మరమ్మత్తు చేయాలని సంబంధిత శాఖ ఇంజినీర్లు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా రహదారి రక్షణ చర్యలను వేగవంతం చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఎత్తి చూపిన సమస్యలను ప్రాముఖ్యతతో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ మరమ్మత్తులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలో ప్రధాన రహదారి నవీకరణ పనులు కూడా ప్రారంభమవుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## పత్తి కొనుగోలును వెంటనే ప్రారంభించాలి

**ఊట్కూర్, నవంబరు 17 ప్రభాతవార్త:** పత్తి రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో తక్షణమే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహ విజ్ఞప్తి చేశారు. ఒక ప్రకటనలో మాట్లాడిన ఆయన, సీసీఐ విధించిన పూటకో నిబంధన కారణంగా రైతులు మాత్రమే కాదు జిన్నింగ్ మిల్లర్లు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం నుండి పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతుల ఆందోళన మరింత పెరిగిందని తెలిపారు. అదీకాక చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో పత్తిని ఎండబెట్టినా తేమ శాతం 12 కంటే ఎక్కువగా వస్తుందని, ఈ పరిస్థితుల్లో రైతులు స్లాట్ బుక్ చేసుకొని మిల్లులకు తీసుకెళ్లినా కొనుగోలు జరగడం లేదని వివరించారు. అలాంటి పరిస్థితుల్లో తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని కూడా సీసీఐ ద్వారా కొనుగోలు చేయేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. అలాగే ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు. అధిక వర్షాల ప్రభావంతో పత్తి పంట భారీగా దెబ్బతిందని, అందువల్ల ప్రతి ఎకరాకు రూ. 25,000 నష్టపరిహారం ఇవ్వడం ద్వారా రైతులను ఆదుకోవాలి అని హెచ్.నర్సింహ అన్నారు.

## సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై విస్తృత ప్రచారం చేయాలి




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను

**నారాయణ పేట, నవంబరు 17 ప్రభాతవార్త:** వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్ల హక్కులపై గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. వృద్ధులను నిర్లక్ష్యం చేసిన సందర్భాల్లో ఆర్డీఓకి ఫిర్యాదు చేసే అవకాశం ఉందని మూడు నెలల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దూర ప్రాంతాల వృద్ధులు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఎల్డర్‌లైన్ 14567 ద్వారా సమస్యలు చెప్పవచ్చని వివరించారు. తల్లిదండ్రుల ఆస్తిని అనుభవిస్తూ వారిని చూసుకోకపోతే, ఆ హక్కులను రద్దు చేసి వృద్ధుల పేరుతో తిరిగి నమోదు చేసే అధికారం కలెక్టర్‌కు ఉందని తెలిపారు. యాక్ట్‌పై మారుమూల ప్రాంతాల్లో కూడావిస్తృత ప్రచారం చేయాలనిఅధికారులు ఆదేశించారు. మంగళవారం డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా ప్రతిజ్ఞ చేసి ఫోటోలు పంపాలని డీడబ్ల్యూవో ఉద్యోగి సాయి కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్, ప్రణీత్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు సోదరభావంతో మెలగాలి

**■ మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్**

**మద్దూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు గ్రామలలో శాంతి-భద్రతల పరిస్థితులను సమీక్షించడం, రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అవగాహన కల్పించడం, మత్తు పదార్థాల నివారణ లక్ష్యంగా మద్దూర్ ఎస్ఐ విజయ్ కుమార్ కొత్తపల్లిని సందర్శించారు. గ్రామంలో ప్రజలతో ఇంటరాక్ట్ అవుతూ వారి స్థితిగతులు, స్థానిక సమస్యలు, భద్రతా అంశాలు తెలుసుకున్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగేందుకు అందరూ సహకరించాలనిసూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎలాంటి వివాదాలు, అక్రమాలు, బెదిరింపులు, చర్యలు గమనించిన వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాలలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రజలంతా కలిసి మెలిసి సోదరా భావంతో మెలగాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎవరికైనా ఒత్తిడి, బెదిరింపులు, ప్రలోభాలు ఎదురైతే వెంటనే పోలీస్ శాఖను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. గ్రామంలో సామరస్య వాతావరణం, పరస్పరగౌరవం, చట్టపరమైన అవగాహనపై సూచనలుచేశారు.గ్రామ ప్రజలకు సమస్యలుంటే పై అధికారులతో చర్చించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



కొత్తపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

# సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహకం

**◆ మండల రైతంగానికి రూ.15లక్షలు మంజూరు ◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నర్వ, నవంబరు 17 ప్రభాతవార్త:** నర్వ మండలంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మండల రైతంగానికి రూ.15 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. నీతి అయోగ్‌లో నర్వ మండలం ఎంపిక కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అని ఆమె పేర్కొన్నారు. సోమవారం నర్వ మండలంలోని ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో యాస్పిరేషన్ బ్లాక్ కింద ఎంపికైన నర్వ మండలంలో నీతి అయోగ్ మార్గదర్శకాల ప్రకారం అన్ని అంశాలలో ప్రగతి అందించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక ప్రకారం పర్యవేక్షణ చేయాలని సూచించారు. మార్గ దర్శకాల ప్రకారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారానికోసారి సందర్శించాలని, గర్భిణీలు, బాలింతలకు సరైన న్యూట్రిషన్ పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. స్యామ్ మ్యామ్ పిల్లల పెరుగుదలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాస్పిరేషన్ బ్లాక్ నీతి అయోగ్ పరిధిలోని ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్ తప్పని సరిగా ఉండాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం కోసం రైతులకు రూ. 15 లక్షలు మంజూరు అయినట్లు కలెక్టర్ ప్రకటించారు. యాస్పిరేషన్ బ్లాక్ పరిధిలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రగతి సాధ్యం అవుతుందని చెప్పారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఏఎక్స్ ఎల్ ల్యాబ్ ల ఏర్పాటు కోసం నర్వ కేజీబీవి పాఠశాలకు సోలార్ కిచెన్ కోసం రూ. 58 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కాగా నీతి అయోగ్‌లో నర్వ మండలం ఎంపిక కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. అలాగే రాష్ట్రంలో ఇన్నోవేటివ్ ప్రాజెక్టు కింద నర్వ ఎంపిక కావడం పట్ల కలెక్టర్ అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డిఆర్డిఓ మొగులప్ప, డిప్యూటీ డీ అండ్‌హెచ్‌ఓ డా. శైలజ, ఎంపీడీవో శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారిణి, సిడిపివో, ఎంఈవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

**ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే**


**గద్వాల టౌన్ నవంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అన్నారు.సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గద్వాల నియోజకవర్గం ఇంది రమ్మ ఇళ్లమంజూరు అయిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలోని ప్రజలు వలసలు వెళ్లేవారనీ, నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ఈ ప్రాంతంలోని ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని, ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రభుత్వం తో వప్పించి ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధి కొరకు శాయశక్తుల కృషి చేస్తున్నానని వారు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలో భాగంగా ఇప్పటికే రెండుగ్యారెంటీలను పూర్తి చేయడం జరిగింది. మహిళా ఫ్రీ, 500 రూపాయల సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచితకరెంటు, రైతులకు రైతు రుణమాఫీ, రైతుబంధు, రేషన్ కార్డులు,సన్నబియ్యం, అందించడం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు సొంత ఇంటి లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రభుత్వము దూర దృష్టితో ఆలోచించి ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఇందిరమ్మ ఇల్లు ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి 5లక్షల రూపాయలతో ఇంది రమ్మఇల్లును కట్టించి పేదల సొంతింటికలను నిజం చేశారన్నారు. గద్వాల నియోజకవర్గలో 250 మంది లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు కావడం జరిగినదని, ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఇంటి నిర్మాణం చేసుకోవాలనీ, ఎవరి మధ్యవర్తిత్వం లేకుండా ప్రభు త్వము నుంచి వచ్చే డబ్బులను నేరుగా వారి ఖాతాలోని జమ కావడం జరుగుతుందన్నారు.ఇప్పటికే గద్వాల నియోజకవర్గం ఇందిరమ్మ ఇల్లు మంజూరు కొన్ని గ్రామాలలో ఇళ్ల నిర్మాణం చేసుకొని గృహ ప్రవేశాలు కూడా చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరంలేదు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్థామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు,మాజీ జడ్పీ చైర్మన్‌బండారి భాస్కర్,జిల్లా గ్రంథా లయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయ కులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉరుకుందు, భాస్కర్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, తూం కృష్ణరెడ్డి,యుగంధర్‌గౌడ్, నాగన్న గోపి, భగవంతు, రామకృష్ణ, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసిన డీఏఓ

**భూత్పూర్,నవంబర్17,ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పలు పత్తి విత్తన శుద్ధి కేంద్రాలను సోమవారం జిల్లా వ్యవసాయాధి కారి బి వెంకటేష్ తనిఖీ చేశారు.పట్టణ కేంద్రంలోని సుదివ్య సీడ్స్ ప్రొసెసింగ్ యూనిట్ నందు గ్రోఔట్ టెస్ట్ వైఫల్యమైన పత్తి విత్తనాల క్రషిగ్ ప్రాసెస్‌ను డీఏఓ పర్యవేక్షించారు.రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశానుసారం 20220-21 నుంచి 2023-24వరకు ఉన్న గ్రోఔట్ టెస్ట్ వైఫల్య పత్తి విత్తనాలను క్రషింగ్ చేయాలన్న ఆదేశాల మేరకు భూత్పూర్ మండల కేంద్రంలోని సుదివ్వ సీడ్స్ ప్రాసెసింగ్ నందు జరుగుతున్న క్రషింగ్ విధానాన్ని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ పర్యవేక్షించారు. ఇతర వివరాలను మండల వ్యవసాయాధికారి మురళిధర్‌ను డీఏఓ అడిగి తెల్సుకున్నారు. మండలంలో 2020-21 నుంచి 2023-24 వరకు మొత్తం 62లక్షల 575.50వందల కేజీల జీఓటీ వైఇల్య పత్తి విత్తనాలు ఉన్నాయని,ఇప్పటివరకు 42వేల 390 కేజీల పత్తి విత్తనాల క్రషింగ్ పూర్తయినట్లు మురళిధర్ తెలిపారు. మిగిలిన విత్తనాలను పదిరోజులలో క్రషింగ్ చేయాలని డీఏఓ కంపెనీప్రతినిధులను ఆదేశించారు.రైతు నుంచి విత్తనాలు కంపెనీ ప్రతి నిధులు కొనుగోలు చేసేప్పుడు చేసే పరిక్షలో క్రాషింగ్ సరిగాన లేక హైబ్రిడ్ కాని విత్తనాలను నాణ్యతలేని విత్తనాలుగా పరిగణి స్తారని డీఏఓ వివరించారు.జీఓటీ తప్పనిసరిగా 90శాతం ఉంటేనే వాటిని నాణ్యత ఉన్న విత్తనాలుగా పరిగణిస్తారని పేర్కొన్నారు. తొంభైశాతం కంటే తక్కువగా ఉంటే వాటిని గాట్ ఫెయిల్డ్ విత్తనాలు అంటారని వివరించారు.



సీడ్స్ క్రషింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 17 ప్రభాతవార్త:** డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పెండింగ్ పనులన్నింటిని త్వరిత గతిన పూర్తి చేసి, డిసెంబర్ లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ఆర్టీసీ డిపోకు సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనుల పెండింగ్ వివరాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న డిసెంబర్‌లోగా గృహాల ప్రారంభోత్సవంచేపట్టనున్నందున, మిగిలి ఉన్న పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందేలా అధికారులు జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీసీ డిపో వద్ద నిర్మితమైన 195 ఇళ్లలో విద్యుత్ సౌకర్యాలు, ప్లంబింగ్, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నందున, వాటిని ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి నుంచి ఇళ్ల వరకు చేరుకునేలా రహదారి పనులు చేపట్టి పూర్తి చేసి, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వాతావరణం కల్పించాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టి, అక్కడ నివసించే ప్రజలకు ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని మున్సిపల్ శాఖకి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం,గృహ నిర్మాణ శాఖాధికారి సంగప్ప, ఈఈ పంచాయతీరాజ్ విజయ్ కుమార్, మున్సిపల్ ఇతర శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

## విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

**బిజినేపల్లి, నవంబరు17 ప్రభాతవార్త:** పదవ తగరతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రఘునందన్ శర్మ అన్నారు.పాలెంతోటపల్లి సుబ్రమణ్యం మెమోరియల్ హైస్కూల్లో సోమవారంఆకస్మికంగా సందర్శించి రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నైపుణ్యా లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యా ర్థులు విధిగా ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగావిని పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా రావడంద్వారా ప్రతి పాఠ్యాంశం చక్కగా బోధపడు తుందన్నారు. తరగతి గదిలోని విద్యార్థులంతా గ్రూప్స్ ఏర్పడి ప్రతి అంశం చర్చించడంద్వారా నేర్చుకున్నఅంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని సూచించారు. ప్రభుత్వం చూపిన మెను ప్రకారం విద్యార్థుల కుభోజనం అందించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రతి అంశాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యా యుడిని అదేశించారు.

## భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు

**బిజినేపల్లి, నవంబరు 17 ప్రభాతవార్త:** కార్తీక చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని పాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక సోమవారం సత్యనారాయణ వ్రతం ఆచరించడం వలన సర్వశుభాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని కోరిన కోరికలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. ఆలయమాజీ చైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి దంపతులు వేద బ్రాహ్మణుల పారాయణం, కథా శ్రవణం దైవ నామస్మరణతో మార్మోగింది. పూజఈ ఆధ్యాత్మిక కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పతాంజలి యోగసమితి అధ్యక్షులు వస్పరి శివుడు,గాడి సురేందర్, సుబ్రహ్మణ్యం, జాకీర్ హుస్సేన్,జగదీష్, మానసాని విష్ణుమూర్తి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు,సత్యనారాయణస్వామి వ్రతం ముగిసిన అనం తరం ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## చదువుల పండుగలో వల్లంపల్లి పాఠశాల

**ఊట్కూర్, నవంబరు17 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని వల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష నారాయణపేట ఆధ్వర్యంలో జరుగుతున్న చదువుల పండుగ కార్యక్రమాలు ఉత్సాహ భరితంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయి వివిధ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించడం జరిగింది.స్పెల్‌బీ పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్న పి. నిత్యను శాలువాతో సన్మానిస్తూ గ్రామ పెద్దలు అభినందించారు. ఇకముందు జరిగే పోటీల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఎడవల్లి రాములు, మన్నె చంద్రశేఖర్, మన్నెరాజు, ఎడవెల్లి హనుమంతులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచర్, ఎల్లప్ప, జంబన్న పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనం పట్టివేత

**నారాయణ పేట, నవంబరు17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌక్ వద్ద వాహనాల తనిఖీల సమయంలో పోలీసులు ఒక బొలెరో వాహనాన్ని అడ్డుకుని పరిశీలించగా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ చిట్టిమోల్ల రమేష్ దామరగిద్ద మండలం ఉల్లిగుండం గ్రామానికి చెందిన వ్యక్తి, వల్లంపల్లి నుండి జాజపూర్ వైపు ఇసుక తరలిస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. ఈ ఘటనపై స్పందించిన టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్రమ ఇసుక రవాణాపై ఎటువంటి రాయితీలు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడ్డ బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేత

**ధన్వాడ, నవంబరు17 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని యనోనిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను అధికారికంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధన్వాడ, ఎంపీవో, అలాగేమండల కాంగ్రెస్‌అధ్యక్షులు నరహరి పాల్గొన్నారు. గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు కూడా భారీగా హాజరయ్యారు. అర్హులైన లబ్ధిదారుల పేర్లను ఖరారు చేసి, వారికి సంబంధిత ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. అయితే ఇంటి నిర్మాణానికి అవసరమైన గ్రౌండింగ్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. త్వరలోనే సంబంధితశాఖలతో సమన్వయం చేసిగ్రౌండింగ్ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి అధికారులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**ఊట్కూర్, నవంబరు17 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండలంలోని అవుసలోనిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి వినతిపత్రం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్‌కు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ మా గ్రామానికిసమీపంలోని పెద్దజట్రంలో కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో అవుసలోనిపల్లి రైతులు దాన్యాన్ని అక్కడికి తరలించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామ రైతుల సౌకర్యార్థం వడ్లకొనుగోలు కేంద్రాన్ని అవుసలోని పల్లిలోనే ఏర్పాటు చేయాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రవీణ్‌కాంత్, జిల్లా బ్యాంకింగ్ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, పీకే ఆంజనేయులు,ఓబులాపురం నాగరాజు,బాలస్వామి,గుడిసె వెంకటయ్య, జట్రం పోలప్పతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

**మక్తల్ టౌన్, నవంబరు17 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకున్న ఈశ్వరి నాగార్జునకి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు నాగార్జున క్లస్టర్ పరిధిలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని,ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని, సంఘం తరపున పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నర్సిరెడ్డి మండల అధ్యక్షులు రవీందర్,ప్రధాన కార్యదర్శి రాకేష్,నరసింహ, ఆంజనేయులు, రాజ్‌గోపాల్, శంకరయ్య,వెంకటయ్య,రాజాంజ నేయులు, రాముగౌడ్, రవీందర్ రెడ్డి,మదన్, శివరాజ్, రాము, నరసింహ, భాస్కర్‌నాయక్, ధనసింగ్, శివజ్యోతి,పావని, గీత,బిందు, మానస తదితరులు పాల్గొన్నారు.

## జూరాల కాలువ వెంట రోడ్డుపై ముల్లకంపలు తొలగింపు

**ఇటిక్యాల నవంబర్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జూరాల కుడికాలు వెంట కోదండపూర్‌కు వెళ్లే దారిలో జూరాల కాల్వ వెంట రైతులు నిత్యం ప్రయాణిస్తుండగా రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచలు మొలవడంతో గ్రామస్తుల సూచన మేరకు సోమవారం మునగాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి జెసిబి ఏర్పాటు చేసి ముళ్లకంచెలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని రైతు రైతులు ముళ్ళకంపల తొలగింపు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు లక్ష్మీనారాయణ రెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించి కాల్వ పై అడ్డంగా ఉన్న ముళ్ళ చెట్లను, అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించడం జరిగింది.. రైతులు కురువ బలరాముడు వెంట ఉండి జెసిబి తొలగించడం జరిగింది. అందుకు గ్రామస్తులు లక్ష్మీనారాయణ రెడ్డికి గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్తీక శోభ



పూజా కార్యక్రమాలకు హాజరైన నేరడగం శ్రీ పశ్చిమాద్రి విరక్త మఠం పీఠాధిపతి పంచమసిద్ధ లింగస్వామి

**ఊట్కూర్, నవంబరు 17 ప్రభాతవార్త :** కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఊట్కూర్ మండల కేంద్రంలోని విధ్యానగర్‌లో శ్రీఅల్లోళీ బసవన్న ఆలయం ఆధ్యాత్మిక శోభతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి సేవల కోసం భారీగా తరలివచ్చి దైవదర్శనం చేసుకున్నారు. ఈ పవిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో రుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ పంచామృతాలతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులు శివనామ స్మరణ చేస్తూ కార్యక్రమాన్ని తిలకించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ వేడుకకు నేరడగం శ్రీ పశ్చిమాద్రి విరక్త మఠం పీఠాధిపతి పంచమసిద్ధ లింగస్వామి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామిజీ రుద్రాభిషేకంలో పాల్గొని, అనంతరం భక్తులనుఉద్దేశించి కార్తీకమాసం విశిష్టతను వివరించారు. భక్తులకు మంగళాశాసనాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయగా, అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు. కార్తీక దీపాలు వెలిగించి, బిల్వపత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తుల సందోహంతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక అతిథిని ఘనంగా సన్మానించారు. కార్తీక సోమవార శోభలో ఆలయం అద్భుత ఆధ్యాత్మిక వాతావరణంతో మరింత కళకళలాడింది.

## నాయి బ్రాహ్మణుల కార్తీక వనభోజనలు



బీచుపల్లిలో కార్తీక వనభోజనంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణులు

**ఇటిక్యాల నవంబర్17, ప్రభాతవార్త:** నాయి బ్రాహ్మణులు సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని వక్తలు అన్నారు. సోమవారం ఉమ్మడి ఎర్రవల్లి మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రంలో కార్తీకమాస వనభోజన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు నందకుమార్ మాట్లాడుతూ... కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని ఈ మాసంలో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో నాయి బ్రాహ్మణ అంద రం కలవడం సంతోషకరమన్నారు. మనం సామాజికంగా రాజకీయంగా ఎదగడానికి మన కల యిక ఒక పునాది అవుతుందన్నారు. ఇందులో అందరి సామాజిక అంశాలను పరిచయాలను తెలుసుకొని వారినిప్రోత్సహించడం అందుకు అందరు సహకరించడం జరుగుతుందని అన్నారు.. కార్యక్రమంలో వివాహపరిచయ వేదిక కూడాఅందరికీ ఉపయోగపడుతుందని ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అందరూ వనభోజన లు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహ కులు అశ్విని. భాస్కర్, వెంకటేశ్వర్లు, బాలస్వామి, గద్వాల వనపర్తి మహబూబ్నగర్ నారాయణపేట నాగర్ కర్నూల్ జిల్లాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అశ్విని. రమేష్, నాగేష్, అశ్విని. అశోక్, శ్రీనివాస్ తో పాటు రాష్ట్ర నాయకులు కిన్నెర శేఖర్. కోట్ల రామకృష్ణ. దొడ్ల రాములు. అగ్రహారం జయన్న ఆయా గ్రామాల నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

## నిధులు లేక నిలిచిపోయిన జీపీ భవన నిర్మాణం పనులు

**ధన్వాడ, నవంబరు17 ప్రభాతవార్త:** ధన్వాడ మండలం మందిపల్లి పాత తండాలో ఎన్ఆర్ ఎజీఎస్ పథకం కింద మంజూరైన రూ.20 లక్షలతో ప్రారంభించిన గ్రామ పంచాయతీ (జీపీ) భవన నిర్మాణం నిధులు సరి పోక మధ్యలోనే ఆగిపోయింది. నాలుగు గోడలు, ప్రాథమిక నిర్మాణ పనులు మాత్రమే పూర్తయ్యాయి. పైకప్పు, తుదిరూపు, విద్యుత్‌నీటి సౌకర్యాలు వంటి కీలక పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తండా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ గ్రామానికి శాశ్వత పంచాయతీ భవనం అత్యవసరమని, పనులు నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు,చేయడానికి పని ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యపై నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి స్పందించి అవసరమైన అదనపు నిధులు మంజూరు చేసి, భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని తండావాసులు కోరుతున్నారు.



నిలిచిపోయిన జీపీ భవన నిర్మాణం

## ఎన్‌జిఓ సహకారంతో అవగాహన కార్యక్రమం

**ఊట్కూర్, నవంబరు 17 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, క్యాషియర్ శ్వేతా ఆధ్వర్యంలో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ (విడ్స్) ఎన్జీఓ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఖాతాదారులకు యు.డి.జి.ఏ.ఎం పోర్టల్ ద్వారా నిద్రావస్థలో ఉన్న ఖాతాల వివరాలు తెలుసుకోవడం, తిరిగి చలామణిలోకి తెచ్చుకునే విధానంపై అధికారులు వివరణ ఇచ్చారు. అలాగే ప్రధాన మంత్రి సురక్షిత బీమా యోజన, ప్రధాన మంత్రి జ్యోతి జీవన్ బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి పథకం వంటి ప్రభుత్వ ప్రయోజనకర పథకాలపై సిబ్బంది వివరించారు. సమకాలీనంగా పెరుగుతున్న సైబర్ నేరాలు నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకునే విధానంపై కూడా బ్యాంకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఓటీపీ, పాస్వర్డ్, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని,అనుమానాస్పద కాల్స్ కిస్పందించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముదిరెడ్డిపల్లి వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని వినతి

**రాజాపూర్, నవంబరు 17 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామ జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల తమ గ్రామం వద్ద అండర్ పాస్ ఇవ్వడం లేదని తమ గ్రామానికి దాదాపు కిలో మీటరు దూరంలో గల పోలేపల్లి సెజ్ వద్ద అండర్ పాస్ ఇస్తున్నారని, దీంతో ముదిరెడ్డిపల్లి నుండి పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణీకులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతారని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేసినట్లు మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవొల్ల శేఖర్ గౌడ్, మొల్గర రాఘవేందర్‌గౌడ్, ఏనుగొండ రామకృష్ణారెడ్డిలు తెలిపారు. బ్రిడ్జి పనులు ప్రారంభం అవుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామ జాతీయ రహదారిపై అండర్ పాస్ ఏర్పాటు చేయకపోతే గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల ప్రజలం ఏకమై ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయనున్నట్లు వారు తెలిపారు. నిత్యంపలు పనుల నిమిత్తం ముదిరెడ్డిపల్లికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు, జాతీయ రహదారి అధికారులు స్పందించి అండర్ పాస్‌ను ముదిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేయాలని ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

● మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి ● 21 ఫిర్యాదుల స్వీకరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు17 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండివచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 21 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావడం, వారి సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం అవ్వడం పోలీసు శాఖ ముఖ్య బాధ్యత అని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది దగ్గరకు వచ్చే ఫిర్యాదుదారులను మర్యాదపూర్వకంగా స్వాగతించి, వారి వినతులను పూర్తిగా విని,అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారంన్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేకు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ లో నమోదు చేసి, పరిష్కారం అయ్యే వరకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్‌డే వేదికగా ప్రజలు నేరుగాతమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వాటి పరిష్కారం వేగవంతమవుతుందని ఎస్పీ జానకి వెల్లడించారు.

# పేదల కలలు నెరవేరుస్తున్న కాంగ్రెస్

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, నవంబర్ 17 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కళలు నెరవేరుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రజా పాలనలో మండలంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన లబ్ధిదారులు మల్లేష్, భ్రమరాంబికలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసి గృహ ప్రవేశాన్ని సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రిబ్బన కట్ చేసి పూజ చేసి లబ్ధిదారులకు స్వీట్స్ తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇందిరమ్మ గృహప్రవేశం ఐమాక్స్ లైట్స్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, చెరువుల చేప పిల్లల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సొంత ఇంటి కళ నెరవేరుస్తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని,గత బిఆర్ఎస్ పాలలో పేదలకు ఒక ఇల్లు కూడా అందించ లేక పేద ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని దుయ్యబట్టారు. పేద ప్రజలు తలెత్తుకునే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల కళలు నెరవేరుతాయన్నారు. మా సొంతఇంటి కళ నెరవేర్చిన కాంగ్రెస్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు మల్లేష్ భ్రమరాంబికలు మాట్లాడుతూ సొంత ఇల్లు లేక రేకుల ఇంటిలో కుటుంబమంతా బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీశామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మా బాధ ఆలకించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇల్లు కేటాయించారని గృహ ప్రవేశాన్ని చేసి మా నోటిని తీపి చేసిన ఈ ప్రభుత్వాన్ని ఎప్పటికీ మర్చిపోకుండా రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీబీ మెంబర్ ఠాగూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ యన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, క్యాసారపు వెంకటయ్య, హమీద్, మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, చెర్క రాజశేఖర్, రమాకాంత్ రెడ్డి, ఎండి రషీద్, అలీ,శ్రీను ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, పుల్లయ్య, భరత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# ప్రజా పాలనతో పేద ప్రజల సొంతింటి కల సాకారం

◆ గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి

**గద్వాల టౌన్ నవంబర్ 17, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన టితోనే పేద ప్రజల స్వంత ఇంటి కళ సాకారమైందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గద్వాల మండలం పరిధిలోని బస్రా చెరువు గ్రామంలో మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలోపద్మమ్మకు మంజూరు కాగ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకోగా నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై రిబ్బన్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం, లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగిందనీ, వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులనుతో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినదన్నారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినదనీ, దాదాపుగా 1500 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని, త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఈ ఇందిరమ్మ రాజ్యంలోఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న పేద ప్రజల సొంతింటి కలప్రజా పాలన సీఎం రేవంత్‌రెడ్డితో సాధ్యమైనది అన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సి న అవసరం లేదనీ, ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దనీ,ఇల్లు రానివారికి కూడారెండో విడతలో అర్హులైన లబ్ధిదా రులకు మంజూరు అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా రైతు సమితి సంఘం మాజీ అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ సర్పంచ్ హరిత నరసింహారెడ్డి, నాయకులు కృష్ణ రెడ్డి, రంగన్న, కిరణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం జిన్నింగ్ మిల్లుల యజమానులు వివిధ డిమాండ్లతో నిరసన వ్యక్తం చేస్తూ పత్తి కొనుగోలు బందు చేయడంతో, రైతులు ఇబ్బందులు పడకుండా సిసిఐ ఉన్నతాధికారులు, ప్రభుత్వ అనుమతితో గద్వాలలో కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ తెలిపారు. సోమవారం సాయంత్రం గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి గద్వాల శివారులోని బాలాజీ జన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. సోమవారం స్లాట్ బుక్ అయిన రైతులు ఉదయం నుంచే వాహనాల్లో పత్తిని అమ్మేందుకు కేంద్రానికి తీసుకు రావడంతో వారికి ఇబ్బందులు కలగ కుండా కలెక్టర్ సిసిఐ,వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఎకరానికి మొదటి రోజుకు 12 క్వింటాళ్లు పత్తి తీసుకోగా, ప్రస్తుతం 07 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేయడం, తేమ శాతం విషయంలో నిబంధనలు సడలించాలని కోరుతున్న నేపథ్యంలో విషయాన్ని ఇదివరకే వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతానికి సిసిఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కొను గోలు ప్రక్రియ నిలిచిపోవడంతో స్లాట్‌బుక్ చేసుకున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారులసహకారంతో మిల్లు యజమానితో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి నట్లు చెప్పారు. ఎకరాకు 12 క్వింటాళ్లు పత్తిని కొనుగోలు చేయా లని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో త్వరలోనే సిసిఐ నుంచి ఆదేశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పర్యటనలో డిఎస్పీ మొగిలయ్య, సిసిఐ ప్రతినిధి రాహుల్, మార్కెటింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



## విద్యార్థులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి

**ధన్వాడ, నవంబరు 17 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని గున్ముకుల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో.. విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు, డయల్100 తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నప్ప లు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షి టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే తమకు తెలిసిన వాళ్ళుగా, సొంతంగా ఉండి అమ్మాయిలను అనేక రకాలుగా మోసం చేస్తున్నారని వారు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గుడ్ టచ్ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమగా అలింగనం చేసుకోవడం, గురువులు విద్యార్థుల తలమీద లాలనగా చేతులు పెట్టడం, స్నేహితులు హైఫై ఇవ్వడం. బ్యాడ్ టచ్...ఇది బాలుడికి / బాలికకు అసహజంగా, భయంగా, అపరాధ భారంగా అనిపించవచ్చు. ఇది ప్రమాదకరమైనదిగా భావించాలి. ఎవరైనా ప్రైవేట్ భాగాలను అనవసరంగా తాకడం, ఒత్తిడి చేస్తూ అతుక్కోవడం లేదా ముద్దు పెట్టడం, ఒంటరిగా ఉండమని బలవంత పెట్టడం, హామీలతో లేదా బహుమతులతో ఆకర్షించడం స్పర్శకు ఒప్పించేందుకు ప్రయత్నించడం. సెల్ ఫోన్‌లో అశ్లీలంగా, ఫోటోలు వీడియోలు చూపించడం పిల్లలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.

విద్యార్థులు గుర్తించుకోవాల్సి న విషయాలు: నాశరీరం నా సొంతం ఎవరు అనవసరంగా తాకకూడదని గుర్తుంచుకోవాలి. ప్రైవేట్ భాగాలు నచ్చని స్పర్శపై ఐయాం నాట్ కంఫర్టబుల్ అని ధైర్యంగా చెప్పాలి. వెంటనే నమ్మదగిన పెద్దలకు తల్లిదండ్రులకు టీచర్కు పోలీస్ వారికి తెలియజేయాలి. ఒంటరిగా ఉండవద్దు ఎవరైనా గుప్తంగా మాట్లాడమంటే నిరాకరించాలి ఈ విషయాలను విద్యార్థినిలు తప్పకుండా గుర్తించుకోవాలని షి టీమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా పరిధిలో ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ కు పాల్పడితే, వేధిస్తే నారాయణపేటపేట షీ టీం సెల్ నంబర్ 8712670398 కి లేదా డయల్ 100, 112 కి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు ఆటలు ఆడాలని, ఆటలు ఆడడంవల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు, జ్యోతి, కవిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

## ఘనంగా యాదవుల సదర్ ఉత్సవాలు

**భూత్పూర్, నవంబర్ 17,ప్రభాతవార్త :** ప్రతీ ఏటా యాదవ సోదరులు ఎంతో వైభవంగా నిర్వహించే దున్నరాజుల విన్యాసాల సదర్ ఉత్సవాలు సోమవారం రాత్రి భూత్పూర్ పట్టణ కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. దాదాపు పది దున్న రాజులు ఈ సదర్‌లో పాల్గొన్నారు. దున్నరాజుల గగుర్పొడిచే విభిన్న విన్యాసాలు, ఆట పాటలు చూపరులను ఇట్టే ఆకట్టుకున్నాయి. సదర్ ఉత్సవాలకు భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలనుంచి ప్రజలు, యాదవులు,యువకులు,ఆయా ప్రాంతాల ప్రజలు తండోప తండాలుగా తరలి వచ్చిదున్నరాజుల విన్యాసాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘాలు,యువజన సంఘాలు, ఉద్యోగ,ఉపాధ్యాయసంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. సదర్ ఉత్సవంలో పాల్గొన్న వారిలో కడప వెంకట నారాయణ యాదవ్,జుర్రు నారాయణ యాదవ్ మహేష్ యాదవ్,కడప కృష్ణయ్యయాదవ్,కడప తిరుపతయ్య యాదవ్, కోట్ల కిష్టయ్య యాదవ్,ధనుంజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## కార్మికులంటే ఇంతా అలుసా.?

(మొదటి పేజీ తరువాయి)

జీతానికి కాను కేవలం 740 చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయేంద్ర ఏజెన్సీ నిర్వాహకులను అడుగుతే బయోమెట్రిక్ ఆధారంగా జీతాలు చెల్లించమని బదులిస్తున్నారని బయోమెట్రిక్ పూర్తిస్థాయిలో వినియోగించుకున్న కార్మికులకు కూడా 8000 జీతం కూడా రాలేదని వాపోయారు. ఏ ఒక్క కార్మికులకు కూడా నెల పూర్తి జీతం అందలేదని అన్నారు. కార్మికులకు అనేక వేయ ప్రయాసలకోర్చి రేయింబవళ్ళు పండగ పబ్బం లేకుండా విధులు నిర్వహిస్తే ఇలా చేస్తారా అని కార్మికులు అంటే ఎంత అలుసా అని ప్రశ్నించారు. కార్మికులు వచ్చిన జీతం చూసుకొని తీవ్రమైన మానసిక క్షోభకుగందరగోళానికి గురవుతున్నారని కనుక కార్మికుల జీతాల కోతలపై విచారణ జరిపి తగ్గించిన వేతన డబ్బులను కార్మికులకు వెంటనే అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకపోవడం కాక ఆందోళన కార్యక్రమానికి దిగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులుగంధం శ్రీను,నరసింహ, నరేందర్, రాజేష్, దర్గాస్వామి, కుమార్,భరత్, భాను ప్రకాష్,రాజు, ఫారుక్,ముజాహిత్, కళావతి,ఇందిరా, అనిత,మంజుల, రూపవతి, కావేరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుంది

(మొదటి పేజీ తరువాయి)

నిలయంగా ఉండేదనీ,గత పది సంవత్సరాల నుండి ఇప్పుడిప్పుడే రైతులు అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో నే మద్దతు ధర 2386 రూపాయలు కొనుగోలు చేయడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు,జిల్లా రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు,మాజీ సర్పంచ్‌హరిత నరసింహా రెడ్డి, నాయకులు కృష్ణరెడ్డి,రంగన్న కిరణ్,అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## నర్వ లాస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

98 బేస్ మెంట్ దశలో,10 స్లాబ్ దశలో, మరో 17 గోడల దశలో కొనసాగుతున్నాయని, త్వరితగతిన నిర్మాణాలలో వేగం పెంచేలా పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారి లబ్ధిదారులను మోటివేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. గత జులై నెలలో ప్రక్రియ మొదలైనా నేటికి నర్వ మండల ప్రగతి సాధించక పోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరి అని ఒక్కోఇంటికి 6 మొక్కలను అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం కొత్త జీవోను జారీ చేసిందని, ఆ జీవో ప్రకారం 30స్క్వేర్ యార్డ్స్ స్థలం ఉన్న వారికి జీ ప్లస్ ఇల్లు నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించిందని హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ తెలిపారు.

## అంబట్‌పల్లిలో కుటుంబ కలహం..

భార్య తల్లి ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డ భర్త

**లింగాల, నవంబరు 17 ప్రభాతవార్త:** భార్య తల్లి ఇంట్లోకి వెళ్లి భర్త దాడికి పాల్పడిన సంఘటన లింగాల మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్పై వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారంఈ విధంగా ఉన్నాయి. అంబట్ పల్లి గ్రామానికి చెందిన బైకాని పరమేశ్వరితో 2014లో జబ్బువిష్ణు తోడెలగడ్డకు చెందిన జబ్బు విష్ణు వివాహం అయింది. ఇద్దరి దంపతుల మధ్య తరుచూగా గొడవలు జరుగుతుండంతో పరమేశ్వరి వేరుగా నివసిస్తుంది. ఈ నెల 15వ తేదిన పరమేశ్వరి భర్త విష్ణు అంబట్ పల్లి గ్రామానికి సాయంత్రం సమయంలో వచ్చి బైకాని నాగులు ఇంట్లోకి ప్రవేశించి భార్య పిల్లలతో గొడవ పడ్డాడు. తన ఇష్టం వచ్చినట్లుగా అసభ్య పదజాలంతో తిడుతూ కర్రతో కొట్టి చంపేస్తానని బెదిరించినట్లు తెలిపారు. గాయాలైన బాధితురాలు బైకాని నాగులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## మహాసభ 11వ వార్షికోత్సవ పోస్టర్ విడుదల

**నారాయణ పేట, నవంబరు 17 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో మహాసభ 11వ వార్షికోత్సవ పోస్టర్ విడుదల చేశారు. నవంబర్ 21న జరగనున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా ముదిరాజ్ ఆత్మగౌరవ ఎజెండా"నినాదంతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2014లో ఆవిర్భవించిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ, ముదిరాజ్ మత్స్యకారుల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనేక మార్పులు సాధించిందని నాయకులు పేర్కొన్నారు. 11 ఏళ్ల ప్రయాణంలో పలు విజయాలు సాధించినప్పటికీ, ఇంకా చేయాల్సినవి చాలానే ఉన్నాయని, అందుకే ముదిరాజ్ జెండాను ఎజెండాగా తీసుకుని బలంగా ముందుకు సాగాల్సి న అవసరం ఉందని తెలిపారు. నవంబర్ 21 ఉదయం 9 గంటలకు ప్రతి గ్రామంలో ముదిరాజ్ జెండా ఎగరవేయాలని, అనంతరం ఉదయం 11 గంటలకు నారాయణపేట బస్టాండ్ ఎదుట ఉన్న జిల్లా మత్స్య సహకార సంఘం కార్యాలయం వద్ద ప్రధాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మహాసభ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతిముదిరాజ్ సమాజ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షులు బి.వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎం.కాంత్ కుమార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**అమరచింత నవంబర్ 17, ప్రభాతవార్త:** చేనేత కార్మికులకు ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అమరచింత పట్టణంలోని చేనేత కార్మికుల స్థితిగతులను చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చేనేత మొగ్గలకు జియో ట్యాగ్ ఉన్న చేనేత కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా పథకం ద్వారా నెలకు 2000 ఇవ్వాలని అలాగే ఇండ్లు లేని చేనేత కార్మికులకు ఇండ్లు కేటాయించాలని అలాగే చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా ఐదు లక్షలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గతంలో చేనేత దుస్తులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసేవారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికుల రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్మానం చేసి పార్లమెంటు కుపంపితే బిజెపి అడ్డుపడుతుందని బీసీ రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్రముఖ్యమంత్రి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎంపార్టీ సీనియర్ నాయకులు మహమూద్, సిపిఎం మండల కార్యదర్శి, జిఎస్‌గోపి,బి వెంకటేష్, ఆర్ ఎన్ రమేష్, టి రాఘవేంద్ర, శ్యాంసుందర్, బుచ్చన్న, చేనేత కార్మికులు తిరుమలదామోదర్, శంకర్, రాము, కురుమన్న, నరసింహ, అంజి, మహమూద్, శేషు పాల్గొన్నారు.